


కడప మనస్సాక్షి
PRGI Reg.No: APTEL/26/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily





వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 సంచిక : 221 | గురువారం, 13 ఆగష్టు 2026 | పేజీలు : 4 | వెల.రూ.2/-


# ఏపీ బీచ్‌శాండ్‌కు మహార్దశ : సీఎం చంద్రబాబుతో కరణ్ అదానీ భేటీ!



అమరావతి ఆగస్టు 12 (మనస్సాక్షి): ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న బీచ్‌శాండ్ మినరల్స్‌కు ఇక కొత్త విలువ చేకూరనుంది. ఇన్నాళ్లూ ముడి ఖనిజాలుగా మాత్రమే చూసిన బీచ్‌శాండ్ వనరులను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాసెస్ చేసి.. అధిక విలువ కలిగిన ఉత్పత్తులుగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు రావడంతో పాటు.. దేశానికి వ్యూహాత్మకంగా కీలకమైన రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. అదానీ గ్రూప్‌తో కీలక భేటీ... రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ కరణ్ అదానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం భేటీ అయింది. శ్రీకాకుళం జిల్లాలో అదానీ గ్రూప్ ప్రతిపాదించిన భారీ టైటానియం ప్లాంట్ సహా.. బీచ్‌శాండ్ మినరల్స్ ఆధారిత పరిశ్రమలపై విస్తృతంగా చర్చ జరిగింది...సుమారు రూ.16 వేల కోట్ల పెట్టుబడితో శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటు చేయనున్న టైటానియం ప్లాంట్ ద్వారా రాష్ట్రంలోని సహజ వనరులకు విలువ జోడించడమే కాకుండా.. దేశీయ పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే ఉత్పత్తులను తయారు చేయవచ్చని అదానీ ప్రతినిధులు సీఎంకు వివరించారు...బీచ్‌శాండ్ మైనింగ్ నుంచి లభించే ఖనిజాలు.. వాటి ద్వారా తయారయ్యే ఉత్పత్తులు.. ఆయా ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న డిమాండ్ వంటి అంశాలను ప్రతినిధులు వివరించారు.

## బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం : మంత్రి పొన్నం



హైదరాబాద్ ఆగస్టు 12 (మనస్సాక్షి) బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తమ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని గురువారం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నట్లు చెప్పారు . లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేయడం జరుగుతుందన్నారు. కుట్టు వృత్తిపై నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించడంతో పాటు, వారి ఆదాయాన్ని పెంచి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు . పథకం విధి విధానాలు, కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను గురువారం నిర్వహించే కార్యక్రమంలో వెల్లడిస్తామని, బీసీ వర్గానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

## ఆర్మీ ఉద్యోగాలపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం..

### -యువత కోసం జిల్లాల్లో ట్రైనింగ్ సెంటర్లు!

హైదరాబాద్ ఆగస్టు 12 (మనస్సాక్షి) : తెలంగాణ యువతను భారత సైన్యంలో చేరేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, భారత సైన్యం కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపిందని ముఖ్యమంత్రి కార్యాలయం పేర్కొంది. ఆర్మీ నియామక ప్రక్రియపై గ్రామీణ, జిల్లా స్థాయి యువతలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం సూచించినట్లు తెలిపింది. జిల్లాల్లోనే ఆర్మీ శిక్షణ.. దక్షిణ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి. రాజేష్ పుష్కర్ బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్‌తో పాటు పలు అంశాలపై ఇరువురు చర్చించారు. దేశవ్యాప్తంగా జరగనున్న ఆర్మీ నియామక కార్యక్రమాలకు ముందే తెలంగాణలోని ఎంపిక చేసిన జిల్లా కేంద్రాల్లో యువత కోసం శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్.. రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ అందించే కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సైన్యం సిద్ధంగా ఉందని తెలిపిందని పేర్కొన్నారు. తద్వారా స్థానిక యువతకు ఆర్మీ నియామక ప్రక్రియ, అర్హతలు, శారీరక శిక్షణ తదితర అంశాలపై ముందుగానే అవగాహన కల్పించే అవకాశం ఏర్పడనుంది.

## మాషా అల్లా స్కాం బాధితులకు న్యాయం చేస్తాం: మంత్రి అనిత



అమరావతి ఆగస్టు 12 (మనస్సాక్షి) మీకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాషా అల్లా స్కాం బాధితులకు హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మాషా అల్లా బాధితులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ గ్రీవెన్స్‌లో దాదాపు 200 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత్ మాట్లాడుతూ.. ఈ స్కాంపై తక్షణమే విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. దీంతో డీసీపీ క్రైమ్స్ తిరుమలేశ్వర్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశామని చెప్పారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ బాధితుల సమస్యపై విజయవాడ పోలీస్ కమిషనర్‌తో ఆమె మాట్లాడారు. ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇస్తామనే మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలను హెచ్చరించారు. పేదల కష్టార్జితాన్ని లక్ష్యంగా చేసుకుని ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## ఏపీలో 'వైట్ గోల్డ్' లిథియం, గాలియం నిక్షేపాల అన్వేషణకు సీఎం శ్రీకారం!



అమరావతి ఆగస్టు 12 (మనస్సాక్షి): ఆంధ్రప్రదేశ్‌లో కీలక ఖనిజాల అన్వేషణకు రాష్ట్ర ప్రభుత్వం మరింత వేగం పెంచింది. భవిష్యత్ పారిశ్రామిక, సాంకేతిక అవసరాలకు అత్యంత కీలకమైన లిథియం, గాలియం నిక్షేపాలపై ప్రత్యేక దృష్టి సారించింది. కడప బేసిన్‌లోని వేంపల్లె, తుమ్మలపల్లె పరిసర ప్రాంతాల్లో ఈ ఖనిజాల ఉనికిపై విస్తృత స్థాయిలో అన్వేషణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), రాష్ట్ర గనులు-భూగర్భశాస్త్ర శాఖల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఎంఓయూ జరిగింది. తుమ్మలపల్లె, పరిసర ప్రాంతాల్లో ఎన్‌జీఆర్ఐ ఇప్పటికే నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో లిథియం, గాలియం ఖనిజాల ఆనవాళ్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. లిథియం గరిష్ఠంగా వెయ్యి పీపీఎం, గాలియం 250 పీపీఎం వరకు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నిక్షేపాల పరిమాణం, నాణ్యత, విస్తీర్ణం, వాణిజ్యపరమైన వినియోగ సామర్థ్యాన్ని నిర్ధారించేందుకు మరింత లోతైన పరిశోధనలు చేపట్టనున్నారు.

## కార్మికుల కనీస వేతనాలపై సమన్వయ సమావేశం



విజయవాడ, ఆగస్టు 12 (మనస్సాక్షి): కార్మికుల కనీస వేతనాలు, సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలుపై కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, సభ్యులతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్మికులకు న్యాయమైన కనీస వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వేతనాల నిర్ణయం, సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికలు రూపొందించాలని మండలి సభ్యులను ఆదేశించారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. నూతన కార్మిక చట్టాలపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో మండలి చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, కార్మిక శాఖ ఉన్నతాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఉప్పాడ తీర రక్షణకు శాశ్వత పరిష్కారం: రూ.323 కోట్లతో రక్షణ గోడ!



మంగళగిరి ఆగస్టు 12 (మనస్సాక్షి): సముద్ర కోతతో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతానికి శాశ్వత రక్షణ కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీరాన్ని సముద్ర కోత నుంచి కాపాడేందుకు రూ.323 కోట్లతో తీర రక్షణ గోడ నిర్మించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఈ ఒప్పందం జరిగింది. తీర రక్షణ గోడకు అవసరమైన సమగ్ర డిజైన్, డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్), నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ మద్రాస్ చేపట్టనుంది. దీంతో ఉప్పాడ తీర రక్షణకు శాస్త్రీయ అధ్యయనాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పరిష్కారం లభించనుంది.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily

# ఘనంగా జగజ్జనని పుట్టినరోజు వేడుకలు

**-108 కలశాలతో మహిళల ప్రత్యేక పూజలు.. భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం**

**-అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, అల్పాహారం**










చెన్నూరు ఆగస్టు 12 (మనస్సాక్షి): ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని జగజ్జనని శ్రీ చౌడేశ్వరి దేవి పుట్టినరోజు వేడుకలను చెన్నూరు మండలం రామన్నపల్లె గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో 108 కలశాలను ఏర్పాటు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతులు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. భక్తులకు అల్పాహారం ఏర్పాటు.. ఆలయానికి విచ్చేసిన ప్రతి భక్తుడికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేసి భక్తులకు అందించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తులకు అల్పాహారం అందిస్తూ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయ కమిటీ చేసిన ఏర్పాట్లను అభినందించారు. భక్తి గీతాలతో మార్మోగిన ఆలయం.. అమ్మవారి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి గీతాలతో మార్మోగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా పూజలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన మంగళహారతి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి జగజ్జనని శ్రీ చౌడేశ్వరి దేవిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం మహిళలు, చిన్నారులు, వృద్ధులు, భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు.. ఆషాఢ అమావాస్య సందర్భంగా జగజ్జనని శ్రీ చౌడేశ్వరి దేవి పుట్టినరోజు వేడుకలను ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా గ్రామ ప్రజలు ఐకమత్యంతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళల ప్రత్యేక పూజలు, 108 కలశాల కార్యక్రమం, మంగళహారతులు, భక్తులకు అల్పాహారం ఏర్పాటు వంటి కార్యక్రమాలతో వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయి. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆకాంక్షించారు. వేడుకల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 12 (మనస్సాక్షి): కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం జి. నరసింహాపురంలో చెన్నుబోయిన సుబ్బరాయుడు అప్పుల బాధతో పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. నాలుగు రోజుల క్రితం అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది.

## నెలాఖరులోగా ప్రభుత్వాసుపత్రుల్లో శానిటేషన్ ఏజెన్సీల సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేయాలి

**-ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, శానిటేషన్ ఏజెన్సీల వారు పరస్పరం సమన్వయంతో పనిచేయాలి: మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**-ఆసుపత్రుల్లోని పరిస్థితులపై 3 గంటలపాటు సమీక్షించిన మంత్రి**



తిరుపతి జిల్లా, తిరుపతి ఆగస్టు 12 (మనస్సాక్షి): ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత పరిశుభ్రత మరిశీత మెరుగుపడేందుకు ఆసుపత్రుల సూపర్డెంట్లు, ఏజెన్సీ వారు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వైద్యుల హాజరు, వారందించే సేవలు, మందుల లభ్యత పట్ల ప్రజల సంతృప్త స్థాయికి తగ్గట్లుగా పరిశుభ్రత విషయంలోనూ సానుకూలత పెరగాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బోధానాసుపత్రులు, జిల్లా, ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రుల్లో పరిశుభ్రత తీరు, సంతృప్త స్థాయి నమోదు ఇతర అంశాలపై అధికారులు, సదరు ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, శానిటేషన్ ఏజెన్సీల వారితో మూడు గంటల పాటు చర్చించారు. ఈ ఏడాది ఏప్రిల్-జులై కాలంలో సెకండరీ ఆసుపత్రుల్లో పరిశుభ్రత పట్ల ప్రజా సానుకూలత ఆశించిన స్థాయిలో నమోదు కాకపోవటం, ఆసుపత్రుల్లోని సమస్యలు, సమన్వయం వంటి అంశాలపై సూపరింటెండెంట్లు, ఏజెన్సీల వారి నుంచి వివరణ కోరారు. ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలలు, బోధానాసుపత్రులు, సెకండరీ ఆసుపత్రుల్లో శానిటేషన్ మరియు సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జరగాల్సిన సిబ్బంది నియమికాలు, వాస్తవంలో నమోదవుతున్న హాజరు, వ్యత్యాసాలను మంత్రి ఆరా తీశారు. ఎఫ్ఆర్ యస్ విధానంలో పూర్తి స్థాయి హాజరు నమోదు కాకపోవడానికి కారణాలపై మంత్రి అధికారులు, ఏజెన్సీల నుంచి తెలుసుకున్నారు తాము తగు స్థాయిలో సిబ్బందిని నియమించినా ఎఫ్ఆర్ యస్ హాజరు కొన్ని కారణాల వలన నమోదు కావడంలేదని ఏజెన్సీలు తెలుపగా, ఈ నెలాఖరుకు మొత్తం సిబ్బంది ఎఫ్ఆర్‌యస్ వ్యవస్థలో నమోదయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు, ఎజెన్సీలను మంత్రి ఆదేశించారు. నిరంతర సమీక్షలు జరగాలి.. మంగళవారంనాటి సమీక్షలో వైద్య సంస్థల ఉన్నతాధికారులు, సర్వీసులందించే ఏజెన్సీల మధ్య ఆశించిన స్థాయిలో సమన్వయం జరగడంలేదని, పారిశుధ్య మరియు సెక్యూరిటీల ప్రాధాన్యత దృష్ట్యా, ఈ అంశాలకు సంబంధించిన అన్ని సమస్యలనూ ప్రతి వారం క్షుణ్ణంగా సమీక్షించి, తీసుకున్న నిర్ణయాలను తదుపరి చర్యలను తనకు అందజేయాలని శాఖ కార్యదర్శి వీరపాండియన్ ఆదేశించారు. వివిధ సంస్థల ప్రాంగణాల్లోని ప్రధాన ప్రాంతాలకు పర్యవేక్షణా అధికారులను నియమించాలని సూచించారు. పూర్తి స్థాయిలో ఎఫ్ఆర్‌యస్ ఎన్‌రోల్‌మెంట్ జరిగిన తర్వాత, మరో సమీక్ష నిర్వహిస్తామని అప్పటికి సేవల నాణ్యత మెరుగుపడాలని కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో డియస్‌హెచ్ చక్రధర్ బాబు, డిఇంఈ డాక్టర్ విష్ణువర్దన్, పలువురు ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు ప్రాధాన్యత



మదనపల్లె ఆగస్టు 12 (మనస్సాక్షి): ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం 16వ రోజుకు చేరుకుంది. మంగళ వారం ఇంటింటికీ వెళ్లిన తులసి రామకృష్ణ, పచ్చిపాల రామకృష్ణ ఆచారి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో మదనపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేతృత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.200 కోట్ల లెక్క ఎక్కడిది? : కేటీఆర్ ఆరోపణలపై మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్!



హైదరాబాద్ : ఆగస్టు 12 (మనస్సాక్షి) : భూ కేటాయింపులు సహా పలు అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో జరిగిన ముఖాముఖి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో పండించిన వరి ధాన్యానికి లభించిన ధర ఎంతో రాష్ట్ర రైతులకు కేటీఆర్ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. భూ కేటాయింపులపై కేటీఆర్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఎకరాకు రూ. 1.50 కోట్ల చొప్పున ఐదు ఎకరాలను రూ. 7.5 కోట్లకు కేటాయించిందని, అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఎకరాకు కేవలం రూ. 90 లక్షలకే కేటాయించిందని వివరించారు. ఈ క్రమంలో కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్ల లెక్కకు ప్రాతిపదిక ఏమిటో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హెచ్ఐఎల్‌టీ (ఎ×ూ) విధానం హైదరాబాద్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొంటూ, పారిశ్రామికవేత్తలలో అనవసర భయాందోళనలు సృష్టించవద్దని కేటీఆర్‌ను హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం తెలంగాణ ప్రయోజనాలకు మంచిది కాదని, రాజకీయ కోపాన్ని ప్రజలపై చూపవద్దని శ్రీధర్ బాబు కోరారు. బీఆర్ఎస్ చేస్తోన్న "గోబెల్స్ తరహా ప్రచారాన్ని" ఇటీవలి లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని వ్యాఖ్యానించారు. అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వాల మంచి విధానాలను కొనసాగిస్తున్నప్పటికీ, నీటి కేటాయింపుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించిందని ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన నీటి వాటా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని, రాబోయే గోదావరి నదీ యాజమాన్య బోర్డు (+=వీదీ) సమావేశానికి హాజరై రాష్ట్ర హక్కులను బలంగా వినిపిస్తామని స్పష్టం చేశారు.

## పేదల వైద్య సహాయానికి ఎమ్మెల్యే చొరవ

గొల్లపూడి, ఆగస్టు 12 (మనస్సాక్షి): పేదలకు వైద్యపరంగా అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కృషి చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత బొమ్మసాని సుబ్బారావు తెలిపారు. జెఎన్ఎన్ఎంయురం కాలనీకి చెందిన షేక్ షకీరా వైద్య చికిత్స కోసం ఎమ్మెల్యే సిఫారసుతో రూ. 1,55,121 విలువైన ఎల్ఓసీ మంజూరైంది. మంగళవారం గొల్లపూడిలో బొమ్మసాని సుబ్బారావు మంజూరు పత్రాన్ని షేక్ షకీరాకు అందజేశారు. ఈ సందర్భంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. సహాయం అందించినందుకు షేక్ షకీరా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg No: APTEL/20/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily
గురువారం, 13 ఆగష్టు 2026

# కుక్క కాట్లపై అవగాహన కార్యక్రమం

**-కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కే.ఉషశ్రీ.**




వేంపల్లి, ఆగస్టు 12 (మనస్సాక్షి) : స్థానిక పట్టణంలోనివై.ఎస్.ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్. ఎస్.ఎస్. యూనిట్ **I & II** మరియు జువాలజీ శాఖఆధ్వర్యంలో "కుక్క కాట్లపై అవగాహన కార్యక్రమం" నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఉష శ్రీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. సాదిక్ బాషా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కుక్క కాటు వల్ల రాబిస్ అనే ప్రాణాంతక వ్యాధి వస్తుందని, కానీ సరైన సమయంలో టీకా వేయించుకోవడం ద్వారా దీనిని 100% నివారించవచ్చని" తెలిపారు. కుక్కలను వేధించవద్దు, తెలియని మరియు వీధి కుక్కలకు దూరంగా ఉండాలి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలి, దూకుడుగా ఉండే వీధి కుక్కల గురించి అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఈ కార్యక్రమంలో "బి అవేర్నెస్ , బి సేఫ్ , సేవ్ లైవ్స్ " మరియు "బి రెస్పాన్సిబిల్ , బి కిండ్ టూ అనిమల్స్ " అనే నినాదాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు జనార్దన్, కుమార్ రాజా,రాజా రెడ్డి, పీడీ తేజేంద్ర, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గాలివీడులో కలకలం.. బావిలో గుర్తుతెలియని మృతదేహం



గాలివీడు ఆగస్టు 12 (మనస్సాక్షి): అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బావిలో లభ్యమవడం కలకలం రేపింది. బోరెడ్డిగారిపల్లి పంచాయతీ పరిధిలోని బక్కిరెడ్డిగారిపల్లి సమీపంలో దేవరకొండ కనుమ వద్ద కోనంపేటకు వెళ్లే రహదారి పక్కన ఉన్న బావిలో సంచిలో మూటకట్టిన స్థితిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. మృతదేహం లభ్యమైన విషయం తెలియడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి? అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని సంచిలో మూటకట్టి బావిలో పడవేసినట్లు ప్రాథమికంగా తెలుస్తుండగా, ఇది హత్యా? లేక మరేదైనా కారణమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తు అనంతరం మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

# సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సాయం

**-మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు రూ. 20 వేలు అందజేత.**



వేంపల్లె, ఆగస్టు 12 (మనస్సాక్షి) : ఇటీవల స్థానిక ఇమామ్ నగర్ ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం ఆ కుటుంబానికి రూ. 20 వేలు నగదును అందించారు. గత రెండు రోజుల క్రితం చక్రపాణిరెడ్డి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి వస్తువులు, వంట సామాగ్రి, నిత్యావసర సరుకులు అన్ని కాలి బూడిదైంది. దీంతో ఆ కుటుంబానికి తినడానికి తిండి కూడా లేని పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యాన్ని కల్పించారు. అలాగే ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. వైసిపి నేతలు కసిరెడ్డి ఆది, పుల్లయ్యతోట నాగేష్, బ్రహ్మానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి -- బీటెక్ రవి

**-పులివెందుల మున్సిపాలిటీలోని గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి.**




పులివెందుల, ఆగస్టు 12 (మనస్సాక్షి) : ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతంలో విద్య ద్వారా మార్పు తీసుకురావడానికి హెడ్‌మాస్టర్ గంగిరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం.- ఈ పాఠశాలతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, తన సోదరి కూడా ఇదే పాఠశాలలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివి, ప్రస్తుతం అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజీలో హెచ్ఓడీగా పనిచేస్తున్నారని తెలిపారు.గతంలో నిర్వహించిన పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు తెలిపారు.- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను సెలవుల్లోనే పూర్తి చేయిస్తామని తెలిపారు.సందేహాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా చర్చించి పరిష్కరించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

# మహిళల భద్రత కోసం శక్తి యాప్-- ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలి

**-వేంపల్లె ఎస్.ఐ.తిరుపాల్ నాయక్.**




వేంపల్లి, ఆగస్టు 12 (మనస్సాక్షి) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేంపల్లి మండలంలోని బుధవారం నాడు ఉర్దూ కళాశాల నందు మహిళల రక్షణ కొరకు రూపొందించిన శక్తి యాప్ గురించి మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. తిరుపాల్ నాయక్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొని శక్తి యాప్ ఉపయోగాలు,అత్యవసర పరిస్థితుల్లో మహిళలు ఈ యాప్ ద్వారా ఎలా సహాయం పొందవచ్చో, యాప్‌ను ఎలా వినియోగించాలో విద్యార్థులకువివరించారు. కార్యక్రమంలో సందర్భంగా ఎస్.ఐ. తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్న సాంకేతిక సదుపాయాలను ప్రతి మహిళసద్వినియోగంచేసుకోవాలని అన్నారు. శక్తి యాప్ వంటి భద్రతా వ్యవస్థలు అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు వెంటనే సహాయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళలపై జరిగే వేధింపులు, దాడులు వంటి ఘటనలను అరికట్టడంలో సమాజం మొత్తం బాధ్యతగా వ్యవహరించాలని, ఎలాంటి సమస్య ఎదురైనా మహిళలు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని పిలుపునిచ్చారు.మహిళల సాధికారతతో పాటు వారి భద్రతకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, మహిళలు సురక్షితంగా ఉన్నప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహిళల రక్షణకు ప్రభుత్వం, పోలీసు శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరువ కావాలని ఆయన ఆకాంక్షించారు.

# ఘనంగా జరిగిన శ్రీరామలింగ చౌడేశ్వరి దేవివారి జయంతి ఉత్సవాలు



పులివెందుల, ఆగస్టు 12 (మనస్సాక్షి) : స్థానిక పట్టణంలోనిశ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి వారి జయంతినాలుగవ వార్షికోత్సవం సందర్భముగా అమ్మవారికి అశేష జన సమూహముగా తరలివచ్చి మహిళలు అమ్మవారికి బోణాలు సమర్పించారు.అనంతరం అమ్మవారి ప్రాకారో త్సవములో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.అనంతరము వారు భక్తిశ్రద్దలతో అమ్మవారి దివ్య దర్శనం పొంది ఆశీస్సులు అందుకున్నారు.అమ్మవారి సన్నిధిలో సుమారు 6 వేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

# ఆర్కే వ్యాలీ క్యాంపస్ లో ఘనంగా నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**-ఎన్.ఎస్.ఎస్.యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ.**



ట్రిపుల్ ఐటి, ఆగస్టు 12 (మనస్సాక్షి) : ఆర్జీయూకేటీ- ఆర్కే వ్యాలీ క్యాంపస్ లో నేడు ఎన్.ఎస్.ఎస్.యూనిట్ 1,2,3,4,7,13 ఽ14 ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆర్కే వ్యాలీ విద్యార్థులు అకాడమిక్ బ్లాక్-1 నుండి క్యాంపస్ లో మూడు రంగుల జెండా తో వందేమాతరం, హర్ ఘర్ తిరంగా వంటి నినాదాలతో క్యాంపస్ మొత్తం ర్యాలీ నిర్వహించారు. చివరగా ఆర్కే వ్యాలీ సంస్కృత విభాగం అధిపతి మొహిద్దిన్ ఖానాద్ ఆధ్వర్యంలో వందేమాతరం గీతానికి విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. తరువాత వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి మన స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ మన వంతు దేశ సేవ చేయాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయ ప్రకాష్,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. దీప్తి ఎన్.ఎస్.ఎస్. యూనిట్1,2,3,4,7,13,14 ప్రోగ్రాం ఆఫీసర్లు, రమేష్ కైలాస్, డాక్టర్ పి. రవికుమార్ , డాక్టర్ జి. తిరుపతి రెడ్డి, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం... రాయచోటి అన్నా క్యాంటీన్లలో 10 లక్షల ఉచిత భోజనాలు


రాయచోటి, ఆగస్టు 12 (మనస్సాక్షి): నిరుపేదలు, కూలి నాలి చేసుకుని జీవించే వారు ఆకలితో ఉండకూడదనే మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించిన అన్నా క్యాంటీన్లు ప్రజలకు పెద్ద భరోసాగా నిలుస్తున్నాయి. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభీష్టం మేరకు రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు అన్నా క్యాంటీన్లలో ప్రతిరోజూ ఒక్క పైసా కూడా తీసుకోకుండా ఉచితంగా భోజనాలు అందించడం విశేషం. రాయచోటి బస్టాండ్, మాసాపేట మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన రెండు అన్నా క్యాంటీన్లలో మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరంగా ఉచిత భోజనాలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 10 లక్షల భోజనాలు ఉచితంగా పంపిణీ చేయగా, ఇందుకోసం రూ.50 లక్షలు ఖర్చు చేయడం సేవా కార్యక్రమానికి నిదర్శనంగా నిలిచింది. మంగళవారం రాయచోటి మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచనల మేరకు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నా క్యాంటీన్ నిర్వాహకులకు రూ.4.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పేదలకు నిరంతరంగా ఉచిత భోజనాలు అందేలా ఈ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా సేవకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వ్యక్తిగత సేవా కార్యక్రమాల ద్వారా కూడా పేద ప్రజలకు అండగా



నిలుస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలో రోజువారీ కూలీలు, నిరుపేదలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, ఉపాధి కోసం వచ్చిన కార్మికులకు ఈ అన్నా క్యాంటీన్లు నిజమైన ఆపన్నహస్తంగా మారాయని ప్రజలు అభిప్రాయపడ్డారు. పేదల ఆకలి తీర్చడం కంటే గొప్ప సేవ లేదనే భావనతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబం చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోంది. రూ.5కే భోజనం అందించే ప్రభుత్వ పథకాన్ని రాయచోటిలో పూర్తిగా ఉచితంగా అమలు చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారని పలువురు ప్రశంసించారు. ఈ సేవా కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుండగా, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా సంక్షేమం పట్ల చూపుతున్న నిబద్ధతకు ప్రజలు తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# సి హెచ్ సి లో డిసిహెచ్ ఎస్ డాక్టర్ హిమాదేవి ఆకస్మిక తనిఖీ..





కమలాపురం, ఆగస్టు 12 (మనస్సాక్షి): కమలాపురం నగర పంచాయతీలోని సి హెచ్ సి ఆసుపత్రిని డి సి హెచ్ ఎస్ డాక్టర్ హిమాదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సమగ్రంగా పరిశీలించారు. సిబ్బంది హాజరు పరిశీలించి, ఆసుపత్రి నందు అడ్మిషన్‌లో ఉన్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని సమస్యలు, అవసరాలపై వైద్యాధికారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, వీలైనంత త్వరగా సేవలను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్లడ్ స్టోరేజ్ సెంటర్ పనుల పురోగతిని సమీక్షించి, పనులు ఎంతవరకు పూర్తయ్యాయో అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా పోస్టుమార్టం గది పనుల పురోగతిని కూడా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను మరింత మెరుగుపరచి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని డి సి హెచ్ ఎస్ ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో కమలాపురం సి హెచ్ సి ఇంచార్జ్ డాక్టర్ శిరీష, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రవిచంద్ర విద్యార్థి ఎంపిక



గాలివీడు, ఆగస్టు 12 (మనస్సాక్షి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ అమరావతి ఛాంపియన్ షిప్--2026 పోటీలకు గాలివీడు మండల కేంద్రంలోని శ్రీ రవిచంద్ర సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థి ఫజిల్ ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం సింటో ఇమ్మాన్యుయేల్, సైజు థామస్ తెలిపారు. మంగళవారం రాయచోటిలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు. త్వరలో తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ లీజా జాయ్,ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మ హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

# శ్రీ మానసా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు


**-శ్రీ మానసా దేవి ఆలయానికి పోటెత్తిన భక్తులు**

**-భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు**

**-ఆలయ నిర్వాహకులు లక్ష్మయ్య స్వామి**

సిద్ధవటం ఆగస్టు 12 (మనస్సాక్షి) : కడప చెన్నై జాతీయ రహదారిలోని శ్రీ మానసా దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మూల విరాట్ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ భాజా భజంత్రీల మధ్య ఊరేగింపు చేశారు సిద్ధవటం మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కనుమలో పల్లె గ్రామం సమీపాన వెలసిన శ్రీ మానసా దేవి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ పూజారి శర్మ మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా మానసా దేవి అమ్మవారికి, కుంకుమార్చన,, పంచామృత అభిషేకాలు నిర్వహించి అమ్మవారి మూల విరాట్ ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ భాజా భజంత్రీల మధ్య ఊరేగింపు చేశామని తెలిపారు ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రత్యేక కోలాటాలతో అమ్మవారికి సారే సమర్పించి భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారని





అమ్మవారి దర్శనానికి కడప, మాధవరం, ఇతర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు మహిళా భక్తులకు, పసుపు కుంకుమ, గాజులు, సమర్పించి అన్నప్రసాదాలు సమకూర్చామని తెలిపారు, అమ్మవారి గుడి సమీపంలో కోలాటం వేసే మహిళలు , కడప, మాధవరం, ఇతర ప్రాంతాల నుండి కోలాటం





వేసేందుకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఊరేగింపు ముందు కోలాటం వేసుకుంటూ అమ్మవారిని ఊరేగింపు చేశారు ఈ కార్యక్రమంలో రవిశంకర్ మహిళలు పిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సవరణపై ప్రత్యేక ప్రచార దినాలు

కడప, ఆగస్టు 12 (మనస్సాక్షి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు 6, 7, 8, 8ఏ దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 18--19 ఏళ్ల యువతతో పాటు జాబితాలో నమోదు కాని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## అంతర్జాతీయ యువజన దినోత్సవంపై న్యాయ విజ్ఞాన సదస్సు




కడప, ఆగస్టు 12 (మనస్సాక్షి): ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి), కడపలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ యువతకు హక్కులు, బాధ్యతలు, విద్య, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధిలో వారి పాత్రపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళలు, బాలల రక్షణ చట్టాలపై వివరించారు. అవసరమైన వారు ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ (సెప్టెంబర్ 12), శాశ్వత లోక్ అదాలత్, నల్సా పథకాలు, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 15100, చైల్డ్‌లైన్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ 14456 తదితర సేవలపై అవగాహన కల్పించారు. యువత చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జే. వెంకటలక్ష్మి, ఎన్‌సీసీ అధికారులు, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఏడవ రోజు కొనసాగిన సీపీఐ పాదయాత్ర

బి.కొత్తకోట, ఆగస్టు 12 (మనస్సాక్షి): "బద్లావ్ జరూరీ హై--మార్పు కావాలి" అనే నినాదంతో సీపీఐ చేపట్టిన ప్రజా సమస్యల పాదయాత్ర ఏడవ రోజు బుధవారం కొనసాగింది. పట్టణంలోని బంగ్లావీధి, జనుపవీధి, కోటవీధి, కొత్తపేట, కాళికమ్మగుడి, జామచెట్టువారి, బలిజవీధి, బోయవీధి తదితర ప్రాంతాల్లో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణప్ప మాట్లాడుతూ పట్టణంలోని సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయని, మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగర పంచాయతీగా స్థాయి పెరిగినా పట్టణ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేస్తామని సీపీఐ నాయకులు తెలిపారు. ప్రజలు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థుల భద్రతపై అవగాహన కార్యక్రమం

కడప, ఆగస్టు 12 (మనస్సాక్షి): జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీవో కాలనీ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నచౌక్ ఎస్ఐ యు. ప్రతాపరెడ్డి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పోలీస్ హెల్ప్‌లైన్, అమ్మాయిలను వేధించడం, ర్యాష్ డ్రైవింగ్, ర్యాగింగ్, ట్రిపుల్ రైడింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భద్రత, శ్రేయస్సు కోసం పోలీసుశాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్ఐ ప్రతాపరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ బి. నాగరాజు, ప్రిన్సిపాల్ సుభాష్, అడ్మిన్ ఆఫీసర్ మల్లికార్జున స్వామి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కారుణ్య ఉద్యోగాల పేరుతో భారీ మోసం.. ఇద్దరు అరెస్ట్



కడప, ఆగస్టు 12 (మనస్సాక్షి): కారుణ్య నియామకాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసి నకిలీ ప్రభుత్వ నియామక ఉత్తర్వులు సృష్టించిన కేసులో ఇద్దరు కీలక నిందితులను కడప I టౌన్ U/G పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ తెలిపారు. నిందితులు సయ్యద్ మస్తాన్ వల్లి, చిలుమారు శ్రీనివాసుల రెడ్డిలు సుమారు 25 మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు, మొత్తం సుమారు రూ.1.70 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ నియామక ఉత్తర్వులు తయారు చేసినట్లు గుర్తించారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా 25 మంది వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాల్లో చేరినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.3.80 కోట్ల మేర నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కేసులో మరికొందరి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోందని, ఆధారాల ఆధారంగా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

## నేతన్న సేవలో పథకాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి



మదనపల్లె, ఆగస్టు 12 (మనస్సాక్షి): నేతన్న సేవలో పథకం రెండో విడతలో అర్హులైన ప్రతి నేతన్నకు న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో నాయకులు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ పథకం ఉద్దేశం మంచిదే అయినా, అర్హులైన కొంతమంది నేతన్నలకు ప్రయోజనం అందలేదని ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి పథకం ప్రయోజనం అందించాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క నేతన్నకు అన్యాయం జరిగినా బాధితుల తరఫున పోరాటం చేస్తామని, అవసరమైతే జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మీనా కుమారి, శరత్ కుమార్ రెడ్డి, ఈశ్వరయ్య, మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ, సోమశేఖర్, నాగరాజు, రవీంద్ర, జీవన్ కుమార్, జగదీష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


## పీఎస్ఓలకు వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్



కడప, ఆగస్టు 12 (మనస్సాక్షి): వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో భాగంగా వ్యక్తిగత భద్రతా అధికారులకు (పీఎస్ఓలు) పునశ్చరణ తరగతులు, ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య ఆధ్వర్యంలో జె.ఎం.జె. కళాశాల సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫైరింగ్‌లో పాటించాల్సిన మెళకువలు, భద్రతా జాగ్రత్తలను నిపుణులైన పోలీసు అధికారులు పీఎస్ఓలకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దయ్య, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, పీఎస్ఓలు పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య.. భార్య, సహనిందితుడి అరెస్ట్

మదనపల్లి, ఆగస్టు 12 (మనస్సాక్షి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను హత్య చేసిన కేసులో భార్యతో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ తెలిపారు. పీలేరు డిష్ కాలనీకి చెందిన మంగినేని ఉమాదేవి (41), చారాల సుబ్రహ్మణ్యం (32) కలిసి మంగినేని వెంకట సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసేందుకు పథకం పన్నినట్లు పోలీసులు తెలిపారు. ఆగస్టు 7న నిందితులు నిద్రమాత్రలను ఆహారంలో కలిపి మృతుడికి ఇచ్చిన అనంతరం, ఆయన నిద్రలోకి వెళ్లిన తర్వాత ఇనుప రాడ్, రాయితో తలపై దాడి చేసి హత్య చేసినట్లు వెల్లడించారు. అనంతరం హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి మదనపల్లి–తిరుపతి జాతీయ రహదారిపై పడేసినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన వస్తువులను కూడా నీటిలో పడేసినట్లు



పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పీలేరు అర్బన్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. ఆగస్టు 11న ఉమాదేవి, చారాల సుబ్రహ్మణ్యాన్ని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన పీలేరు సీఐ జి. వెంకటేశ్వర్లు, కలకడ సీఐ బి. లక్ష్మన్న, ఎస్ఐ రహీం, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

## రాజ్యాంగ నిర్మాతకు ఎమ్మెల్యే పాశం ఘన నివాళి

వాకాడు ఆగస్టు 12 (మనస్సాక్షి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌కు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ఘన నివాళులర్పించారు. వాకాడులో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఇంటింటి ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే.. అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట వాకాడు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284